సాక్షి తిరుపతి

బుధవారం। 28। ఆగస్టు। 2024



మట్టి కొట్టేస్తున్నారు!
చంద్రగిరి మండలం చిన్నరామాపురం పంచాయతీలోని రంగయ్య చెరువును టీడీపీ నేతలు తవ్వేస్తున్నారు. - 8లో



'పద్మావతి'లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు
పద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఆల్ ఇండియా కేటగిరీ కింద ఎంబీబీఎస్ అడ్మిషన్లు చేపట్టారు. - 8లో



నిబంధనల మేరకే బదిలీలు
ప్రభుత్వ నిబంధనల మేరకే ఉద్యోగుల బదిలీలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. - 8లో



గైడ్‌లైన్స్ అమలు చేయాలి



మహిళా వైద్యుల సంరక్షణకు సుప్రీంకోర్టు తీసుకువచ్చిన గైడ్‌లైన్స్‌ను తక్షణం అమలు చేయాలి. ప్రభుత్వాస్పత్రులు, మెడికల్ కళాశాలల్లో ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్ కమిటీ, ఇంటర్నల్ కంప్లయింట్ మిటీలను ఏర్పాటు చేయాలి. ఎమర్జెన్సీ హాట్ లైన్ సెంటర్ కచ్చితంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ఆస్పత్రి, హాస్టల్ పరిసర ప్రాంతాల్లో నిత్యం సీసీ నిఘా ఏర్పాటు చేయాలి. - డాక్టర్ శ్రీధర్ ముని, తిరుపతి

కనీస వసతులు తప్పనిసరి



వైద్యులపై దాడులు జరుగుతుంటే స్పందించి హామీలతో చేతులు దులుపుకోవడం వద్దు. ప్రభుత్వాలు మహిళా వైద్యుల కట్టుదిట్టంగా భద్రత కల్పించాలి. 36 గంటల పాటు కంటిన్యూగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లకు కనీస వసతులు అందించడం తప్పనిసరి. వైద్యుల సేవలేమో అత్యుత్తమంగా ఉండాలి. సౌకర్యాలు మాత్రం అంతంతే ఉంటున్నాయి. డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్ రూమ్ కూడా లేకుండా విధులు ఎలా నిర్వహించగలుగుతాం. ప్రభుత్వాలు డాక్టర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. - డాక్టర్ సుకుమార్, తిరుపతి

వేధింపుల నిరోధక కమిటీ అవసరం



ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య విద్యార్థినుల రక్షణలో భాగంగా మహిళా వేధింపుల నిరోధక కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలి. కమిటీలోని వైద్య విద్యార్థినుల సూచనల ఆధారంగా చర్యలు చేపట్టాలి. అత్యవసర విభాగం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఎంతో అవసరం. మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. తీవ్రమైన చర్యలు ఉంటేనే కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. - డాక్టర్ సాయి లేఖ్య, తిరుపతి

కఠోర శిక్షణ.. భవితకు రక్షణ

భావిభారత పౌరులను క్రమశిక్షణకు మారుపేరుగా తీర్చిదిద్దాలి.. విద్యార్థి దశ నుంచే దేశభక్తిని నూరిపోయాలి.. సమాజంలోని అసమానతలు దరి చేరకుండా సన్మార్గంలో నడిపించాలి.. జన్మభూమి కోసం అవసరమైతే యుద్ధభూమిలోకి దూకేలా సిద్ధం చేయాలి.. భరతమాత సంరక్షణ కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించేలా సన్నద్ధం చేయాలి.. ఇదే లక్ష్యంతో నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌ను కేంద్ర రక్షణశాఖ ప్రారంభించింది. ఈ మేరకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తోంది. వారి ఉన్నత భవితకు మార్గం సుగమం చేస్తోంది.





డ్రిల్ ప్రాక్టీస్ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

- విద్యార్థుల్లో దేశభక్తిని ప్రేరేపించేలా ఎన్‌సీసీ ట్రైనింగ్
- గణతంత్ర వేడుకల్లోనూ సత్తా చాటుతున్న జిల్లా క్యాడెట్లు
- ప్రతిభ కనబరిస్తే ఉద్యోగాలు.. ఉన్నత విద్యలోనూ ప్రత్యేక కోటా
- తిరుపతి ఎన్‌సీసీ నగర్‌లో రాటుదేలుతున్న వేల మంది విద్యార్థులు

తిరుపతి సిటీ : ప్రపంచంలో ఎన్‌సీసీ తొలిసారిగా జర్మనీలో 1666లో ప్రారంభించబడింది. భారతదేశంలో సైన్యం కొరతను తీర్చడమే లక్ష్యంగా 1917లో యూనివర్సిటీ కార్ప్స్ పేరుతో పురుడుపోసుకుంది. 1920లో యూనివర్సిటీ ట్రైనింగ్ కార్ప్స్ (యూటీసీ)గా ఏర్పడింది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం యూనివర్సిటీ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్(యూఓటీసీ)గా పేరు మార్చింది. ఈ మేరకు పండిట్ హెచ్ఎస్ కుంజ్రూ నేతృత్వంలోని కమిటీ జాతీయ స్థాయిలో పాఠశాలలు, కళాశాలలో క్యాడెట్ సంస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేయడంతో 1948 జూలై 15వ తేదీన నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌గా రూపాంతరం చెందింది. 1949లో కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీసీలో బాలికలకు సైతం అవకాశం కల్పించింది. 1950లో ఎయిర్ వింగ్, 1952లో నావల్ వింగ్‌శాఖలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. 1965 ఇండో-పాక్, 1971లో బంగ్లా-పాక్ యుద్ధ సమయంలో మొదటి వరుసలో ఆర్మీ జవాన్లు ఉండగా, రెండవ రక్షణ శ్రేణిగా ఎన్‌సీసీ క్యాడెట్లు విధులు నిర్వర్తించారు. దీంతో ఎన్‌సీసీ వింగ్ దేశానికి అవసరమని పూర్తి స్థాయిలో గుర్తించారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా 17 డైరెక్టరేట్లు, సుమారు 667 ఆర్మీవింగ్, 60 నావల్, 61ఎయిర్‌వింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు.

మెరుగైన ఉద్యోగావకాశాలు



సెల్యూట్ చేస్తున్న క్యాడెట్లు

ఎన్‌సీసీలో విద్యార్థులకు ఉన్నత విద్యలో సీట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నోటిఫికేషన్లలో ప్రత్యేకంగా కేటగిరీని బట్టి 1 నుంచి 5శాతం వరకు రిజర్వేషన్ వర్తిస్తుంది. దీంతో పాటు సాయుధ బలగాలలో ఏటా 100 పోస్టులకు ఎన్‌సీసీ రిక్రూట్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ ద్వారా చేస్తున్నారు. అలాగే మెడిసిన్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులలో 5శాతం వరకు రిజర్వేషన్లు పొందే అవకాశముంటుంది.



వెపన్ ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

రిపబ్లిక్ డే వేడుకలకు సైతం..

తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కమాండ్ నుంచి ఏటా సుమారు 10 నుంచి 20మంది వరకు ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో కవాతుకు ఎంపికవుతున్నారు. ఈ ఏడాది తిరుపతి గ్రూప్‌కు చెందిన శ్రీకాంత్ అనే విద్యార్థి పాల్గొని ప్రధాని మోదీ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం విశేషం. అలాగే ఢిల్లీలో నిర్వహించనున్న సైనిక్ క్యాంపునకు తిరుపతి గ్రూప్ నుంచి సుమారు 10మంది వరకు హాజరుకానున్నారు.

తిరుపతిలో ఏటా 3,500 మందికి..

తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కేంద్రంగా 7 యూనిట్ల ఆధ్వర్యంలో ఏటా సుమారు 3,500 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఏటా ఒక్కో యూనిట్‌కు 5 క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందేందుకు అర్హత, మౌలిక వసతులు ఉన్న పాఠశాలలు జూన్, జూలైలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌సీసీ అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఆయా పాఠశాలలను పర్యవేక్షించిన తర్వాత సీట్లు కేటాయిస్తారు. 95 పాఠశాలు, 45 జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆర్మీ, ఎయిర్‌వింగ్, నావల్ వింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. అడ్వంచర్స్, స్పోర్ట్స్ కు సంబంధించిన కోర్సులలోనూ ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నారు.

ఉద్యోగం సాధించా



దేశ సేవ, క్రమశిక్షణ అలవాటు చేసే ఏకైక సంస్థ ఎన్‌సీసీ. ఎన్‌సీసీ విద్యార్థి అనగానే సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉంటుంది. డిగ్రీ పూర్తి చేసి 70 శాతం మార్కులతో సి-సర్టిఫికెట్ సాధించా. 2024 జరిగిన ఎన్‌సీసీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్‌లో ఆ కోటా కింద శిక్షకురాలిగా ఈ ఏడాది మార్చిలో ఉద్యోగం లభించింది. ఇంత తొందరగా ఉద్యోగం సాధిస్తానని అనుకోలేదు. ఎన్‌సీసీ విద్యార్థులకు ఇదో వరంలాంటిది. - మృదుల, గర్ల్స్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్, తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్

బీఎస్సీలో సీటు వచ్చింది



నాకు అగ్రికల్చరల్ సైంటిస్ట్ అవ్వాలనే కోరిక ఉండేది. ఎన్‌సీసీ కోటా కింద గత ఏడాది అగ్రికల్చరల్ బీఎస్సీలో సీటు సాధించా. ఎన్‌సీసీ బి-సర్టిఫికెట్ లేకుంటే నాకు ఈ అవకాశం దక్కేది కాదు. - జి. రెడ్డి చరణ్, విద్యార్థి, తిరుపతి

దేశభక్తిని పెంపొందించేలా..



విద్యార్థి దశనుంచి క్రమశిక్షణతో పాటు దేశభక్తిని పెంపొందించేలా ఎన్‌సీసీ శిక్షణ ఇస్తున్నాం. ట్రైనింగ్ తీసుకున్న ఎంతో మంది విద్యార్థులు ఎన్‌సీసీ కోటా కింద ఇంజనీరింగ్, మెడిసెన్, ఎంటెక్, బీటెక్‌లో అడ్మిషన్లు పొందుతున్నారు. అలాగే కేంద్ర సాయుధ బలగాలలోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ప్రత్యేక డ్రైవ్‌లతో ఎన్‌సీసీ విద్యార్థులను రిక్రూట్ చేసుకుంటారు. - ఎస్‌వీ సుబ్బారెడ్డి, సుబేదార్ మేజర్, తిరుపతి

జీవితం మలుపు తిరిగింది



మాది పీలేరు. చదువుకునే సమయంలో ఎన్‌సీసీలో చేరి సి-సర్టిఫికెట్ సాధించా. దీంతో ఎంఈడీలో ఎన్‌సీసీ కోటా కింద సీటు వచ్చింది. తర్వాత పీహెచ్‌డీ పూర్తి చేశా. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, ఎన్‌సీసీ నగర్‌లో జరిగే 29వ యూనిట్ లో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నా. ప్రతి విద్యార్థికీ ఎన్‌సీసీతో ఎంతో మేలు చేకూరుతుంది. ఎంతటి సమస్యలనైనా ఎదుర్కొనే మనోధైర్యం కల్పిస్తుంది. - డాక్టర్ జయపాల్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్, తిరుపతి గ్రూప్

ఎంబీబీఎస్ సీటు దక్కింది



ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశా. ఎన్‌సీసీ బి-సర్టిఫికెట్ సాధించా. తర్వాత నీట్ రాస్తే జనరల్ కేటగిరీలో సీటు రాలేదు. ఎన్‌సీసీ కోటా కింద సీటు దక్కింది. బెంగళూరులో ఎంబీబీఎస్ చదువుతున్నా. - సృజన, వైద్య విద్యార్థిని, తిరుపతి

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,910 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,320 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.26 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

రేపు శ్రీకాళహస్తిలో ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ అపోలో ఫార్మసీ ట్రెయినీ కెమిస్ట్‌గా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలో పనిచేసేందుకు పురుషులు, తిరుపతి యంగ్ ఇండియా శాఖలో పనిచేసేందుకు 21–32 ఏళ్ల యువతీయువకులు, టీసీఎల్‌లో పనిచేసేందుకు 21–32 ఏళ్ల యువతీ యువకులు కావాలన్నారు. విద్యార్హత 10 నుంచి డిగ్రీ చదివి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 10గంటలకు విద్యార్హత ధ్రువీకరణపత్రాల జిరాక్సు కాపీలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9440802338, 9985020936 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేరు మార్చి.. అవే పరీక్షలు..!

విద్యారంగం అభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులను తీసుకురావాల్సిన కూటమి సర్కారు అనాలోచితంగా అడుగులేస్తోంది. గతంలో ఉన్న పరీక్షలు..పథకాల పేర్లు మార్చడం తప్ప నాణ్యమైన విద్యను అందించడంపై దృష్టి సారించడం లేదు. గతంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌ను కాస్తా, సెల్ఫ్ అసెస్‌మెంట్ టెస్ట్‌గా మార్చివేసింది. ఈ క్రమంలోనే పిల్లలకు ఉపయోగపడే టోఫెల్ తరగతులకు పూర్తిగా మంగళం పాడేసింది.

- నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు
- ఫార్మేటివ్ అసెస్‌మెంట్ కాస్త సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా మార్పు
- ఆరు రోజుల పాటు పరీక్షలు
- టోఫెల్ పరీక్షకు కూటమి సర్కారు మంగళం



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు ప్రయోజనం కలిగించేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు అమల్లోకి తీసుకొచ్చిన టోఫెల్ పరీక్షకు ప్రస్తుత కూటమి సర్కారు మంగళం పాడింది. అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థుల బంగారు భవిష్యత్‌పై నీళ్లు చల్లుతోంది. చిత్తూరు జిల్లాలో అన్ని యాజమాన్యాలకు సంబంధించి 2,982, తిరుపతి జిల్లాలో 3,063 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,84,128 మంది, తిరుపతి జిల్లాలో 3,08,237 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును కూటమి సర్కారు మార్పు చేసింది. ఇంతవరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)గా ఉన్న యూనిట్ టెస్టులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ (ఎస్ఏఎం)గా పేరు మార్చుతూ ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడాదికి మూడుసార్లు నిర్వహించే యూనిట్ టెస్టులను ఇప్పటిదాకా రోజుకు రెండు పరీక్షల చొప్పున నిర్వహించేవారు. తాజా ఆదేశాల మేరకు ఇక నుంచి ఈ సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను ప్రతిరోజు ఒక్కో సబ్జెక్టు చొప్పున ఆరు రోజులు కొనసాగిస్తారు. ఈ పరీక్షలు నేటి నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించనున్నారు.

నమూనాలో ఎలాంటి మార్పులేదు..

మార్కుల నమూనాలో ఎలాంటి మార్పు చేయలేదు. యూనిట్ పరీక్షల స్థానంలో ఇంతవరకు నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షల స్థానంలో 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసే వారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు చొప్పున 6 రోజుల పాటు పరీక్ష నిర్వహించనున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల స్కూళ్ల వివరాలు

చిత్తూరు జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు 2,064	ప్రాథమికోన్నత పాఠశాలలు 293
ఉన్నత పాఠశాలలు 625	1 నుంచి 10 వరకు విద్యార్థులు 2,84,128
తిరుపతి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు 2,108	ప్రాథమికోన్నత పాఠశాలలు 333
ఉన్నత పాఠశాలలు 622	1 నుంచి 10 వరకు విద్యార్థులు 3,08,237


పరీక్షల షెడ్యూల్ ఇదే..

ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు, ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

'టోఫెల్'కు మంగళం


పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రవేశ పెట్టిన టోఫెల్ తరగతులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. అకడమిక్ క్యాలెండర్‌లో సైతం దీనిపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

పకడ్బందీగా ఏర్పాట్లు..



జిల్లా వ్యాప్తంగా సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. అన్ని మండలాలకు ప్రశ్నపత్రాలను చేరవేశాం. పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి. - దేవరాజు, డీఈఓ, చిత్తూరు

మేలు చేయాల్సింది పోయి..



కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లల్లో చదివే విద్యార్థులకు మేలు చేయాల్సింది పోయి, అన్యాయం చేస్తోంది. టోఫెల్ తరగతులు సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఉపయోగకరం. వీటిని రద్దు చేయడం సరికాదు. - శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పెద్దశేషునిపై పరంధాముడు



ఊరేగుతున్న దేవదేవేరులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణస్వామివారు మంగళవారం రాత్రి పెద్దశేష వాహనంపై విహరించారు. శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేక సేవ చేపట్టి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం మురళీకృష్ణునికి స్నపన తిరుమంజనం జరిపించారు. రాత్రి విశేష అలంకారభూషితులైన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు పెద్దశేష వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో వీజీఓ నందకిషోర్, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, ఏవీఎస్ఓ సతీష్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి ఆస్థానం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

'పద్మావతి'లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు


అడ్మిషన్ పొందిన విద్యార్థులతో వైద్యులు

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు ఆరుగురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ చేతుల మీదుగా అడ్మిషన్ పత్రాలను అందుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ 26వ తేదీ నుంచి ఆల్ ఇండియా కోటా అడ్మిషన్ల ప్రక్రియ మొదలైందని వెల్లడించారు.అందులో పద్మావతి మహిళా వైద్య కళాశాలకు 26 సీట్లు కేటాయించారని చెప్పారు. వివిధ కేటగిరీల కింద అడ్మిషన్లు పొందిన వారిలో న్యూఢిల్లీ–1, జమ్మూ కాశ్మీర్–1, ఆంధ్రప్రదేశ్–1, కేరళ–2, రాజస్థాన్–1 విద్యార్థులు ఉన్నారన్నారు. క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించాలని అడ్మిషన్ పొందినవారికి సూచించారు. తల్లిదండ్రులకు, వృత్తికి గౌరవం తెచ్చేలా నడుచుకోవాలని కోరారు.

30న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి టి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10గంటలకు ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. మూడు ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భద్రత కట్టుదిట్టం


ప్రభుత్వాస్పత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. సరైన భద్రత లేకపోవడంతోనే ఆస్పత్రి ప్రాంగణాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వైద్య విద్యార్థినులు హాస్టల్కు వెళ్లే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు సెక్యూరిటీని పెంచాలి. రోగుల అటెండర్ల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వైద్యులతో స్నేహభావంతో మెలిగే సంస్కృతి రావాలి. – డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, తిరుపతి



భయం వేస్తోంది


వైద్యులే కాకుండా మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు తల్లిదండ్రులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. బిడ్డలను బయటకు పంపాలంటే భయం వేస్తోంది. మహిళల పట్ల సమాజంలో మార్పు రావాలి. సర్వస్వం బిడ్డలే అనుకుని పెంచి ఓ స్థాయికి వచ్చే క్రమంలో ఇలాంటి ఘటనలు జరిగి కడుపుకోత మిగిల్చుతున్నాయి. ఇంతటి ఘోరాలు జరుగుతుంటే తల్లిదండ్రులు ఎలా బతకాలి. – సుజాత, వైద్యురాలి తల్లి, తిరుపతి

మట్టి కొట్టేస్తున్నారు!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారు. కనిపించిన వాటన్నింటినీ ఆదాయ వనరులుగా మార్చేసుకుంటున్నారు. చెరువుల నుంచి యథేచ్ఛగా మట్టిని కొల్లగొట్టేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి అక్రమ రవాణాకు అండగా నిలుస్తున్నారు. ఇదే అదునుగా పచ్చమూక ఆబగా ఎగబడిపోతున్నారు. సంపాదనే లక్ష్యంగా జనం నోట్లో మట్టికొట్టేస్తున్నారు.

చిన్నరామాపురం రంగయ్య చెరువులో మట్టి తవ్వేసిన దృశ్యం


- రంగయ్య చెరువులో అక్రమ తవ్వకాలు
- రాత్రి వేళల్లో గ్రావెల్ తరలించేస్తున్న టీడీపీ నేతలు
- 10 రోజులుగా సాగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదంటున్న గ్రామస్తులు

చంద్రగిరి : మండలంలోని చిన్నరామాపురం పంచాయతీలో ఉన్న రంగయ్య చెరువును టీడీపీ నేతలు కొల్లగొడుతున్నారు. 10 రోజులుగా రాత్రి వేళల్లోనే జేసీబీలతో మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. టిప్పర్లతో నిరంతరాయంగా మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు.

కోటిన్నర విలువైన గ్రావెల్ తరలింపు

రంగయ్య చెరువులో తవ్విన మట్టిని టీడీపీ నాయకులు శ్రీనివాసమంగాపురం, చెర్లోపల్లె, పెరుమాళ్లపల్లె, పుదిపట్ల ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వీటితో పాటు తిరుపతిలో నిర్మిస్తున్న పలు కమర్షియల్ భవంతులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమ గ్రావెల్ రవాణాపై ఫిర్యాదు చేసిన గ్రామస్తులపై పచ్చమూక దౌర్జన్యానికి దిగుతోంది. మీ అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. రోజూ సుమారు 100 లోడ్లను రవాణా చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తరలించిన మట్టిన ఒక్కో లోడు సుమారు రూ.15వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన టీడీపీ నాయకులు గత 10 రోజులుగా తరలించిన మట్టి విలువ సుమారు రూ.1.5కోట్ల వరకు ఉంటుందని రైతులు వెల్లడిస్తున్నారు.


రంగయ్య చెరువు నుంచి సోమవారం రాత్రి టిప్పర్‌లో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

రెవెన్యూ వారి సహకారంతోనే..

గ్రావెల్ అక్రమ రవాణాకు సంబంధించి స్థానికంగా ఉండే రెవెన్యూ అధికారి, సహాయకుడు సంపూర్ణంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆ ఉద్యోగికి రేషన్ డీలర్ దుకాణాన్ని నజరానా అందిస్తారని తెలిసింది. మరో అధికారికి ఒక్కో లోడుకు రేటు నిర్ణయించి ముడుపులు అందిస్తున్నారన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

వేటు పడినా తీరుమారలా..!

అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలను ఇటీవల పోలీసులు ఎస్కార్ట్ వాహనంతో పంపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఎస్కార్ట్‌గా వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డులను ఎస్పీ సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే ప్రస్తుతం గత 10 రోజులుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నప్పటికి రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వాటిని అడ్డుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఎస్పీ హెచ్చరించినా సిబ్బంది తీరు మారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

స్పందించని అధికారులు

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు మైనింగ్, రెవెన్యూ, రాత్రిల్లో గస్తీ కాసే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలో అతి వేగం వెళుతున్న టిప్పర్ కారణంగా విద్యుత్ వైర్లు తెగిపోయాయని, సకాలంలో గుర్తించడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు వాపోయారు. చెరువులో మట్టిని తోడేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయి, వ్యవసాయ బోర్లు నిరుపయోగంగా మారే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ తరలింపుపై మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే, ఇరిగేషన్ అధికారులు చెప్పాలని తప్పించుకుంటున్నారని విమర్శిస్తున్నారు. తీరా ఇరిగేషన్ వారికి ఫిర్యాదు చేస్తే తగినంత సిబ్బంది లేరని జారుకుంటున్నట్లు మండిపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

"చెరువులు, వాగులు, వంకల్లోని గ్రావెల్‌ను తరలించడం చట్టరీత్యా నేరం. చిన్నరామాపురం సమీపంలోని రంగయ్య చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలించడంపై చర్యలు తీసుకుంటాం. వెంటనే మా సిబ్బంది ద్వారా విచారణ చేసి, అక్రమ రవాణాకు అడ్డుకట్టవేస్తాం.
– శివరామ సుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

త్వరలో తక్కువ ధరకే గ్యాస్

- ఇంటింటికీ మీటర్ల ఏర్పాటు
- ఏజీపీ ప్రథమ్ గ్యాస్ ఎండీ అభిలేష్ గుప్త

తిరుపతి అర్బన్: త్వరలో తక్కువ ధరకే గ్యాస్ అందిస్తామని ఏజీపీ ప్రథమ్ గ్యాస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అభిలేష్ గుప్త తెలిపారు. శ్రీసిటీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తిరుపతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 90శాతం పైప్‌లైన్ పనులు పూర్తిచేశామని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులకు విద్యుత్ సరఫరా తరహాలో వారి ఇంటికి మీటర్లు ఏర్పాటు చేస్తామని.. వాడకాన్ని బట్టి యూనిట్ లెక్కన ధరలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ముందుగా శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలకు, ఉద్యోగుల వాహనాలకు, వారి గృహ అవసరాలకు సహజవాయును అందిస్తున్నామని చెప్పారు. రెండో దశగా రాష్ట్రంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు అందిస్తామని పేర్కొన్నారు. రూ.3500 కోట్లతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని వివరించారు. రీజనల్ హెడ్ గౌతమ్ ఆనంద్ విధివిధానాలను తెలియజేశారు.


మాట్లాడుతున్న అభిలేష్ గుప్త

నిబంధనల మేరకే బదిలీలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలను నిబంధనల మేరకే చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఓలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. బుధవారం ఈ మేరకు చిత్తూరు, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్లతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా బదిలీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి చెన్నయ్య, గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి పాల్గొన్నారు.

'గ్రీవెన్స్' అర్జీలకు ప్రాధాన్యం

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపు వినతుల్లో పేర్కొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు కాలేదనే అంశాలను అర్జీదారులు సంతృప్తి చెందేలా వివరించాలని చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఫించన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మృతి చెందిన తర్వాత నేత్రదానం చేయడం ఎంతో పవిత్రమైన బాధ్యతగా భావించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మంగళవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మృతి చెందిన తర్వాత మన నేత్రాలు ప్రపంచాన్ని చూడడం దైవ కార్యంగా పేర్కొన్నారు. అలాంటి అవకాశం పొందడం దేవుడు ఇచ్చిన వరంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ మధుబాబు, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూపకుమార్, ఎస్వీఆర్ఆర్‌జీహెచ్ ఆప్తాల్మజీ హెచ్ఓడీ చలపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

తిరుపతి అర్బన్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 90వ వార్షికోత్సవం నేపథ్యంలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు, విజేతలకు బంపర్ బహుమతులు అందించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆర్థికపరమైన అంశాలు, ఆర్థిక క్రమశిక్షణపై ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ జాతీయ, జోనల్, రాష్ట్రస్థాయిలో మూడు దశలుగా పోటీలు ఉంటాయని వివరించారు. జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.10 లక్షలు, రెండో బహుమతికి రూ.8 లక్షలు. మూడో బహుమతికి రూ.6 లక్షలు అందిస్తారని తెలిపారు. దేశంలో ఐదు జోన్‌లను విభజించారని చెప్పారు. జోనల్ స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతికి రూ.4 లక్షలు, తృతీయ బహుమతికి రూ.3 లక్షలు ఉంటాయని చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రథమ బహుమతికి రూ.2 లక్ష, రెండో బహుమతికి రూ.1.5 లక్షలు, 3వ బహుమతికి రూ. లక్ష అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీకి 25ఏళ్ల లోపు వారు మాత్రమే పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తిగలవారు www.rbi90quiz.in లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. అలాగే సందేహాల నివృత్తికి www.rbiquiz.infaqs లో చెక్ చేసుకోవాలని కోరారు.క్విజ్ ప్రాక్టీస్ కోసం www.rbi90quiz. inpractice&quiz వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

టీడీపీ నేతల ఇసుక దోపిడీ


పొర్లుకట్టను తొలగించిన దృశ్యం


జేసీబీతో ట్రాక్టర్‌కు ఇసుక లోడింగ్

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : నాయుడుపేట సమీపంలో స్వర్ణముఖినది నుంచి టీడీపీ నేతలు యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. పొర్లుకట్టను సైతం తొలగించి యంత్రాల సాయంతో ఇసుక తవ్వేస్తున్నారు. అధికారులు, పోలీసులను మామూళ్లతో జోకొట్టి మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.4,500 లెక్కన అమ్మేస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా మైనింగ్, సెబ్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేతల ఇసుక దందాపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతిలో చిరుత కలకలం

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ప్రాంతాల్లో చిరుతపులి సంచారంపై కలకలం రేగింది. సెక్యూరిటీ సిబ్బంది స్పష్టంగా సమాచారం అందించడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ అగ్రికల్చరల్ కళాశాల, వసతి సముదాయాలు, స్టాఫ్ క్వార్టర్స్, వెటర్నరీ వర్సిటీ ఆవరణలో విద్యార్థులు ఒంటరిగా తిరగరాదని, అత్యవసరమైతే గుంపులుగా బయటకు వెళ్లాలని సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. ప్రధానంగా శేషాచల అడవులకు సమీపంలో వెటర్నరీ, అగ్రికల్చరల్ కళాశాలు ఉండటంతో చిరుతల సంచారం పెరుగుతోంది. మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో అగ్రికల్చరల్ కళాశాల, వెటర్నరీ వర్సిటీ మహిళా వసతిగృహాల పరిసరాలలో చిరుతను చూసి విద్యార్థినులు పరుగులు తీసినట్లు తెలిసింది.

'గ్రీన్‌టెక్'పై ప్రజాభిప్రాయ సేకరణ

నాయుడుపేటటౌన్ : మేనకూరు సెజ్‌లోని గ్రీన్ టెక్ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ మేరకు కంపెనీకి ప్రభుత్వం అనుమతులు జారీ చేయడంతో, దీనిపై అందరి అభిప్రాయాలను తీసుకున్నారు. ద్వారకాపురం పంచాయతీ సర్పంచ్ శ్రావణి, జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, మేనకూరు ఎంపీటీసీ సభ్యుడు చెన్న కేశవులు, సీడీసీ మాజీ చైర్మన్ కట్టా సుదాకర్ రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం తదితరులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పరిశ్రమ విస్తరణకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్ కుమార్, ఏఈఈ మదన్ మోహన్, స్థానిక తహసీల్దార్ గీతావాణి, డీటీ రాజేంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత ఎస్ఐ మృతి


రామయ్య (ఫైల్)

పాకాల: మండలంలోని దామలచెరువు హైస్కూల్ గేటుకు చెందిన విశ్రాంత ఎస్ఐ లింగనపల్లి రామయ్య(73) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన స్వగ్రామం లింగనపల్లెలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. పేద కుటుంబానికి చెందిన రామయ్య పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. అప్పట్లో నక్సలైట్ల ఏరివేత కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. నాగన్న దళం కమాండర్ నాగన్నను ఎన్‌కౌంటర్ చేయడంతో రామయ్య జీవితం మలుపు తిరిగింది. ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఆ తరువాత తిరుపతి స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో ఎస్ఐగా, తదనంతరం అనంతపురం పీటీసీ పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో అసిస్టెంట్ లా ఇన్‌స్పెక్టర్‌గా(ఏఎల్ఐ)గా 13 ఏళ్ల పాటు సేవలు అందించారు. ఆదిలాబాద్ జిల్లా బాసర పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఉద్యోగ విరమణ పొందారు.

శాస్త్రోక్తం.. గోకులాష్టమి ఆస్థానం

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా గోకులాష్టమి ఆస్థానం నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామిని సాక్షాత్తు శ్రీకృష్ణునిగా భావించి ఆస్థానం జరిపించడం ఆనవాయితీ. ఈ క్రమంలో రాత్రి 8 గంటలకు శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామివారికి ఏకాంత తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ద్వాదశారాధన చేపట్టారు. శ్రీకృష్ణ స్వామి వారిని సర్వభూపాల వాహనంపై వేంచేపు చేసి ప్రబంధగోష్ఠి, పురాణ పఠనం చేపట్టారు. ఈ మేరకు బుధవారం తిరుమలలో ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

తిరుపతి క్రైమ్ : నగరంలో తీర్థకట్ట వీధిలో ఒక వ్యక్తి మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. ఓ వ్యక్తి ఫుల్లుగా మద్యం తాగి కారు డ్రైవింగ్ చేస్తూ వేగంగా వెళ్లి తీర్థకట్ట వీధిలో ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొని అక్కడి నుంచి పరారయ్యాడు. స్తంభం కూలిపోవడంతో ఆ ప్రాంతం మొత్తం విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతు చేయి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ అధికారులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

ఐరన్ లోడ్ లారీ అపహరణ

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు పక్కన నిలబెట్టి ఉన్న సుమారు రూ.30 లక్షల విలువైన ఐరన్ లోడుతో ఉన్న లారీ అపహరణకు గురైనట్లు యజమాని మంగళవారం గుర్తించారు. వివరాలు.. స్థానిక రాజగోపాలపురం వీధికి చెందిన వేమల బాలాజీకి చెందిన లారీలో పెళ్లకూరు మండలం చెంబడిపాళానికి చెందిన రవి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కర్ణాటకలోని దావణగిరి వద్ద ఓ పరిశ్రమలో ఐరన్ పట్టాలను లారీలో లోడ్ చేసుకుని చెన్నైకు బయలుదేరాడు. సోమవారం రాత్రి నాయుడుపేటలో రోడ్డు పక్కన లారీ నిలిపి డ్రైవర్ తన ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసే సరికి లారీ కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు యజమానితో కలిసి ఫిర్యాదు చేశాడు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తిరుపతి రూరల్ : తిరుపతిలోని బైరాగిపట్టెడ మాతమ్మ ఆలయం వీధిలో ఓ రియల్టర్ ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండానే ఇసుక, సిమెంట్ బస్తాలను నిర్లక్ష్యంగా ఆరు బయట లిఫ్ట్ ద్వారా పై అంతస్తుకు పంపుతున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం ఉదయం సిమెంట్ బస్తా ఒక్కసారిగా లిఫ్ట్ నుంచి జారి కింద ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో అవి తెగి రోడ్డుపై పడిపోయాయి. ఇంటి నుంచి చెత్త వేయడానికి బయటకు వచ్చిన ఓ మహిళ అప్పుడే పక్కకు జరిగింది. లేకుంటే అన్యాయంగా ఓ నిండు ప్రాణం విద్యుదాఘాతానికి బలయ్యేది. ట్రాన్స్‌కో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధించారు. ట్రాన్స్‌కో అధికారులు ఈ మేరకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన రియల్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్ : వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులకు మంగళవారం తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ జైలు శిక్ష విధించారు. వివరాలు.. ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన కేసులో కృష్ణా జిల్లా ,తిరువూరు మండలం, ముష్టికుంట్ల హరిజనవాడకు చెందిన డ్రైవర్ ఎం.ప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష , రూ.7వేల జరిమానా విధించారు. అలాగే చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి, జర్నలిస్టు కాలనీకి చెందిన పి.రోహిత్ సాయికి 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.